ప్రజాశక్తి
బుధవారం 21 ఫిబ్రవరి 2024 5
అనంతపురం

ఎన్నికలకు అన్నివిధాలా సన్నద్ధం

◆ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల అమలు తప్పనిసరి
◆కలెక్టర్ ఎం.గౌతమి, ఎస్పీ అన్బురాజన్

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అధికారులు అన్ని విధాలా సన్నద్ధం కావాలని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్పనిసరిగా అమలు చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి, ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని జెఎన్‌టియు ఆడిటోరియంలో సాధారణ ఎన్నికలు-2024లో భాగంగా ఎస్-ఎస్టీ, వీఎస్టీ, వీవీటీ, ఎఫ్ఎస్టీ, ఎంసీసీ బృందాలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల్లో ఎస్ఎస్టీ, వీఎస్టీ, వీవీటీ, ఎఫ్ఎస్టీ, ఎంసీసీ అధికారులు, సిబ్బంది ముఖ్యపాత్ర వహించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యాక ఆయా బృందాల అధికారులు అన్ని విధాల సన్నద్ధమై ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తూచాతప్పకుండా అమలు చేయాలన్నారు. ఎన్నికల్లో మద్యం, డబ్బు, ఇతర వస్తువులు రవాణా కాకుండా ఐటీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలు కీలకపాత్ర పోషించాలన్నారు. స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులకు ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత ఆర్వో, డిఇఒకి తెలపాలన్నారు. ఎస్పీ అన్బురాజన్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల్లో లాఅండ్‌ఆర్డర్ పక్కాగా అమలు చేయాలన్నారు. ఎన్నికలు సజావుగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి, డీఆర్డీఏ పీడీ నరసింహారెడ్డి, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐకి జాగా కరువు,!

◆ఏడాదిన్నరగా స్థల పరిశీలనకే పరిమితం
◆డిస్పెన్సరీలతోనే సరి
◆రెఫరల్ ఆసుపత్రులూ లేవు
◆అందని ద్రాక్షలా కార్మికులకు మెరుగైన వైద్యం

ప్రజాశక్తి-అనంతపురంప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏడాదిన్నరగా ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి జాగా దొరకలేదు. ఆసుపత్రి మంజూరై 18 మాసాలు పూర్తయినా స్థలం దొరక్క నిర్మాణాలు ప్రారంభం అవలేదు. మరోవైపు రెఫరల్ ఆసుపత్రులు కూడా స్థానికంగా లేకపోవడంతో కార్మికులు, వారి కుటుంబాలు అనారోగ్యం బారినపడితే లక్షలు ఖర్చు పెట్టుకుని వైద్య సేవలు పొందాల్సిన దుస్థితి నెలకొంది. ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఖరారు చేయడంలోగాని, రెఫరల్ ఆసుపత్రులను కేటాయించే అంశంపైగాని పాలకులు పట్టించుకుంటున్న పాపానపోలేదు.

ఏడాదిన్నర క్రితం ఈఎస్ఐ ఆసుపత్రి మంజూరు

2022 మార్చిలో రాష్ట్ర వ్యాప్తంగా ఏడు ప్రాంతాల్లో ఆసుపత్రులను మంజూరు చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెనుకొండ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ధారించారు. ఇప్పటికీ స్థల నిర్ధారణ పూర్తవలేదు. రెండు పర్యాయాలు కేంద్ర ఈఎస్ఐ అధికార బృందం పర్యటించి కూడా వెళ్లింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి చొరవ లేకపోవడంతో ఈ ఆసుపత్రి ఎక్కడ ఏర్పాటు చేయాలన్న దానిపై ఇప్పటికీ స్పష్టత రాలేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం అధికారపార్టీకి చెందిన ప్రజాప్రతినిధులే అందరూ ఉన్నప్పటికీ దీనిపై దృష్టి సారించిన దాఖలాల్లేవు. హిందూపురం పార్లమెంటు సభ్యులుగానున్న గోరంట్ల మాధవ్ సైతం దీని ఏర్పాటుకు కృషి చేయాలేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

డిస్పెన్సరీల్లో ప్రాథమిక చికిత్సతోనే సరి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇఎస్ఐ పరిధిలో 40 వేల మందికిపైగా కార్మికులున్నారు. యజమాన్యాల తరుపున ఈఎస్ఐకు కొంత మొత్తాన్ని రెగ్యులర్‌గా చెల్లిస్తున్నారు. వీరికి కార్మిక శాఖ ద్వారా ఈఎస్ఐ నుంచి అవసరమైన వైద్య సేవలందాల్సి ఉంది. ఇందుకుగానూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనంతపురం, హిందూపురంలో రెండు డిస్పెన్సరీలున్నాయి. అక్కడ ప్రాథమిక వైద్యం వరకు అందించడానికి వీలుంది. ఏదైనా క్లిష్టతరమైన ఆరోగ్య సమస్యలొస్తే మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలందించాల్సి ఉంటుంది. దీనికి గతంలో రెండు ప్రయివేటు ఆసుపత్రులకు రెఫర్ చేసేవారు. ఇప్పుడు ఆ రెఫరల్ ఆసుపత్రులను కూడా తొలగించారు. ఏదైనా ఆరోగ్య సమస్య తీవ్రంగా ఉంటే తిరుపతికెళ్లాల్సి ఉంటుంది. అక్కడా పరీక్షించి మెరుగైన వైద్యమందివ్వాలంటే అక్కడి నుంచి వారు రెఫర్ చేయాల్సి ఉంటుంది. దీంతో కార్మికులకు ఈఎస్ఐ ద్వారా వైద్యమందటం ఇబ్బందికరంగా మారింది. కనీసం రెఫరల్ ఆసుపత్రులను అయినా స్థానికంగా ఉండే విధంగా చూడాలని కోరుతున్నారు.

ఈఎస్ఐ వైద్యసేవలు అందించాలి

ఈఎస్ఐ ఆసుపత్రుల ఏర్పాటుకు సాధ్యమైనంత త్వరగా స్థలం కేటాయించి, నిర్మాణ పనులు చేపట్టాలి. అంతవరకు స్థానికంగా అవసరమైన వైద్యసేవలందించేందుకు వీలుగా రెఫరల్ ఆసుపత్రులు ఏర్పాటు చేయాలి. కార్మికులకు ఏదైనా సమస్యలొస్తే వైద్యానికి అధికంగా ఖర్చులై అప్పులపాలయ్యే పరిస్థితులున్నాయి. ప్రభుత్వం చొరవచూపి మెరుగైన వైద్యసేవలందించే విధంగా చర్యలు తీసుకోవాలి.

ఎస్.నాగేంద్ర కుమార్,
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, అనంతపురం.

డిఇఒ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎడిఫై పాఠశాలపై చర్యలు తీసుకోండి

డిఇఒ కార్యాలయం వద్ద విద్యార్థిసంఘాల నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనుమతులు లేకుండా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న అనంతపురం నగరంలోని ఎడిఫై వరల్డ్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ముందస్తు అడ్మిషన్ల పేరుతో నగరంలో ఏర్పాటుచేసిన ఎడిఫై వరల్డ్ స్కూల్ ఫ్లెక్సీలను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ విద్యార్థి సమైఖ్య ఆధ్వర్యంలో డిఇఒ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతురు పరమేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణయ్య, కుల్లాయిస్వామి, బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి సురేష్ యాదవ్ మాట్లాడుతూ అనంతపురం నగరంలో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా ఎడిఫై వరల్డ్ స్కూల్ ముందస్తుగా అడ్మిషన్లు చేస్తోందన్నారు. ఇందుకు సంబంధించి నగరంలో పెద్దపెద్ద హోర్డింగ్‌లను సైతం ఏర్పాటు చేస్తోందన్నారు. నగరంలో ఏర్పాటుచేసిన ప్రచార ఫ్లెక్సీలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి లక్షలాది రూపాయలను ఫీజులు రూపంలో వసూలు చేస్తున్నారన్నారు. రాంనగర్ బ్రాంచిలో ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న కేంద్రాన్ని తక్షణం మూసి వేయాలని డిమాండ్ చేశారు. విద్యాధికారులు స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సిద్దు, భీమేష్, సోము, వీరు, మతేష్, నరసింహ, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, నగర అధ్యక్ష, కార్యదర్శులు మంజునాథ్, ఉమామహేష్, నాయకులు హరికష్ణ, నారాయణస్వామి పాల్గొన్నారు.

బిజెపిని భూస్థాపితం చేద్దాం

ఉరవకొండలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సాకే శైలజానాథ్

◆సిద్ధంతో ప్రయోజనం శూన్యం
◆26న అనంతలో కాంగ్రెస్ ఎన్నికల శంఖారావం
◆మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్

ప్రజాశక్తి-ఉరవకొండ, రాయదుర్గం

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ పాలన సాగిస్తున్న బిజెపిని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటుతో భూస్థాపితం చేయాలని మాజీ మంత్రి డా॥సాకే శైలజానాథ్ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన ఉరవకొండ, రాయదుర్గంలో కాంగ్రెస్ నాయకులతో సమావేశం అయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా ప్రజా ప్రయోజనాలను పక్కనపెట్టి స్వార్థ రాజకీయాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి అనుసరిస్తున్న విధానాలతో దేశంలో రైతులు, కార్మికులు సామాన్య ప్రజలతోపాటు బడుగు,బలహీన వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇలాంటి పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. శైలజానాథ్ సమక్షంలో ఉరవకొండకు చెందిన టిడిపి నాయకులు అహ్మద్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ప్రతాపరెడ్డి, ఉరవకొండ నియోజకవర్గం ఇన్‌ఛార్జి రామానాయుడు, డిసిసి ఉపాధ్యక్షులు వడ్ల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి సోనియా శీన, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చెన్నయ్య, మండల, పట్టణ అధ్యక్షులు సుధాకర్ పాల్గొన్నారు.

26న అనంతపురంలో కాంగ్రెస్ ఎన్నికల శంఖారావం

రాయదుర్గం : ఈనెల 26వ తేదీన అనంతపురంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల శంఖారావంను ప్రారంభిస్తున్నట్లు శైలజనాథ్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం రాయదుర్గంలోని ఎన్జీవో హోంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 26న అనంతపురంలో కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభలో ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి ఇతర ముఖ్య నాయకులు పాల్గొంటారన్నారు. ఇదే సభలో కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టో, అజెండాను ప్రకటించే అవకాశం ఉందన్నారు. ఇటీవల అనంతపురంలో జరిగిన వైసిపి సిద్ధం సభ గురించి మాట్లాడుతూ వైసిపికి ఎలాంటి అజెండా లేదన్నారు. సిద్ధం సభలో అనంతపురం జిల్లాకు వైసిపి ప్రభుత్వం ఏమి చేసిందో.. భవిష్యత్తులో ఏమి చేయబోతోందో చెప్పలేదన్నారు. రాష్ట్రంలో అధికారపక్షం దిగిపోవడానికి ఇంకా కొద్దిరోజులు మాత్రమే సమయం ఉందన్నారు. విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ప్రతాపరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామానాయుడు, ఉపాధ్యక్షులు కోరి నాగరాజు, యువజన కాంగ్రెస్ తాలూకా అధ్యక్షుడు ఊరువాకిలి అనిల్ కుమార్, రాయదుర్గం పట్టణ అధ్యక్షుడు జయన్న పాల్గొన్నారు.

సత్యనారాయణరెడ్డితో మాజీమంత్రి శంకరనారాయణ

నార్పల సత్యనారాయణరెడ్డిని కలిసిన శంకరనారాయణ

నార్పల : మండల కేంద్రంలోని స్వగృహంలో మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ సత్యనారాయణరెడ్డిని అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్త శంకరనారాయణ మంగళవారం కలిశారు. నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులును విభేదించి సత్యనారాయణరెడ్డి అసమ్మతి వర్గంలో ఉన్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఆసరా కార్యక్రమం ముగింపు అనంతరం శంకరనారాయణ కలయికకు ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా నియోజకవర్గ రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చించి ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులుకు సపోర్ట్ చేయాలని కోరినట్లు తెలుసోంది. దీంతో ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయానికి తాము ఎలాంటి సహకారం అందిస్తామని తెగేసి చెప్పినట్లు తెలుసోంది. అయితే కనీసం పార్లమెంట్ స్థానానికైనా సహకారం అందించాలని విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో నాయకులు మాగపట్నం శివారెడ్డి, నార్పల మాజీ సర్పంచి ఖాదర్‌వలి, ఉపసర్పంచి శ్రీరాములు, తుంపెర పక్కీర్‌రెడ్డి, దుగ్గుమర్రి నారాయణరెడ్డి, గూగుడు శివశంకర్‌రెడ్డి, నడిమిదొడ్డి మునిరెడ్డి, బొందలవాడ రంగయ్య, చికెన్ గోపాల్, మన్నీల శివయ్య, వైసిపి అభిమానులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

రాయదుర్గం : పట్టణంలోని 1, 2, 6, 8, 9, 12, 15వ సచివాలయాల పరిధిలో 2, 4, 10, 11, 12, 14, 21, 27 ఎన్నికల వార్డుల్లో ఖాళీగా ఉన్న 10 వార్డు వాలంటీర్ల పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ షేక్ మాలిక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుండి 35 సంవత్సరాల్లోపు యువతీ, యువకులు ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలి

కమిషనర్‌కు సిఐటియు నాయకుల వినతి

కమిషనర్ మేఘస్వరూప్‌నకు వినతిపత్రం అందజేస్తున్న ఎటిఎం నాగరాజు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో పెరిగిన జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచడంతోపాటు కార్మికుల నిరవధిక సమ్మె సమయంలో ఇచ్చిన హామీలను కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం అజెండాలో చేర్చి ఆమోదించాలని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎటిఎం నాగరాజు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక కార్యాలయంలో కమిషనర్ మేఘస్వరూప్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వీలుగా పారిశుధ్యం, ఇంజనీర్ సెక్షన్ విభాగంలో కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. అలాగే మున్సిపల్ కార్మికులు చేపట్టిన 16 రోజుల సమ్మె పోరాటంలో భాగంగా అధికారుల సమక్షంలో జరిగిన చర్చల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అదనంగా పనిచేస్తున్న కోవిడ్, మలేరియా గార్బేజ్ కార్మికులకు రూ.15 వేలు వేతనంతోపాటు టీఎల్ ఆఫీస్ ద్వారా ఒకటే చెక్కు రూపంలో అందరికీ వేతనాలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ ఈనెలలో జరగబోయే కౌన్సిల్ సమావేశంలో కార్మికుల సమస్యలతోపాటు చర్చల్లో ఇచ్చిన హామీల అమలుకు అజెండాలో పొందుపరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ లీడర్, ఎక్స్ ఎన్ నెంబర్ నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మాటతప్పని నాయకుడు సిఎం జగన్

ప్రజాశక్తి-నార్పల

మాట తప్పని నాయకుడు సిఎం జగన్ అని ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సెవెన్ హిల్స్ కళ్యాణ మండపంలో మహిళా సంఘాలకు నాలుగో విడత ఆసరా రుణమాఫీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి రూ.9.51 కోట్ల ఆసరా నిధులు మంజూరయ్యాయని తెలిపారు. మండలవ్యాప్తంగా 1058 మహిళా సంఘాల్లోని 11449 మంది మహిళలకు రుణమాఫీ వర్తించిందన్నారు. మహిళలు గతంలో చంద్రబాబు పాలన, ప్రస్తుత సిఎం జగన్ పాలనను గమణించాలన్నారు. 2014లో చంద్ర బాబు 650 హామీలు ఇచ్చి కేవలం 6 హామీలు కూడా అమలు చేయలేదన్నారు. అదే 2019లో జగన్ ఇచ్చిన హామీల్లో 90 శాతం పూర్తి చేశారనానరు. అంతేగాకుండా పాలనను ప్రజల వద్దకు తీసుకొచ్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఒకవేళ పొరపాటున చంద్రబాబుకు ఓటేస్తే పథకాలన్నీ చేజేతులా పోగొట్టుకున్న వారు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి శంకరనారాయణ, శింగనమల సమన్వయకర్త వీరాంజనేయులు, వైసిపి మండల కన్వీనర్ రఘునాథ్‌రెడ్డి, రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ ప్రమీల, ఎంపిపి నాగేశ్వరరావు, మండల ప్రత్యేక అధికారి రామసుబ్బారెడ్డి, రైతు సహకార సొసైటీ ఛైర్మన్ లోకనాథ్‌రెడ్డి, వైస్ ఎంపిపి మల్లేశ్వరయ్య, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఉమాదేవి, నాయకులు రమాదేవి, శంకర్‌యాదవ్, పద్మాకర్‌రెడ్డి, రాజారెడ్డి, కాటమయ్య, సబిరా, రమణకుమారి, కుళ్లాయిరెడ్డి, మొరసు రమణారెడ్డి, సంజీవరెడ్డి, డొక్కా కృష్ణ, కేశవరెడ్డి, కురుగానపల్లి గోపాల్‌రెడ్డి, ముచ్చుకుంటపల్లి నారాయణరెడ్డి, వెలుగు ఏసీ మద్దిలేటి, ఎపిఎం తిప్పమ్మా, సీసీలు రామకృష్ణ, పుల్లారెడ్డి, సరస్వతి, రామచంద్ర, కోటేశ్వరమ్మ, మహిళ సమాఖ్య అధ్యక్షురాలు పర్వీన్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

'ఆసరా' కార్యక్రమంలో నాయకులు



కుందుర్పి మండలంలో మెగా చెక్కు అందజేస్తున్న ఎంపీ తలారి రంగయ్య

కుందుర్పి : దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో మహిళలకు పెద్దపీట వేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని కళ్యాణదుర్గం సమన్వయకర్త, ఎంపీ తలారి రంగయ్య అన్నారు. మంగళవారం మండలం కేంద్రంలోని అమ్మ మండల సమైఖ్య కార్యాలయం దగ్గర నాలుగో విడత ఆసరా రుణమాఫీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణదుర్గం నియోజకవర్గవ్యాప్తంగా మహిళల ఖాతాల్లోకి నాలుగు విడుతల్లో రూ.175 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. ఒక కుందుర్పి మండలానికే రూ.37 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ మెగా చెక్కు అందజేశారు.

ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, సర్పంచి మారుతీశ్వర రామమూర్తి, జడ్పిటిసి రాధాస్వామి, వైస్ ఎంపిపిలు, భీమిరెడ్డి, శ్రీలక్ష్మీఅజయ్‌బాబు, కో ఆప్షన్ సభ్యులు ముజీవుల, వాల్మీకి స్టేట్ డైరెక్టర్ పాలాక్షి, మార్కెట్ యార్డు డైరెక్టర్ లింగప్ప, సీనియర్ నాయకులు సుదర్శన్‌రెడ్డి, ఎంపిటిసి గంగమ్మ, హనుమంతురాయుడు, ఎపిఎం హుస్సేన్, ఐకెపి అధికారులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రభుత్వం స్పందించకపోతే పోరాటం ఉధృతం చేస్తాం-కలెక్టరేట్ ఎదుట ధర్నాలో జిల్లా ఉద్యోగ జేఏసీ నేతలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జెఎసి నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్‌లకు బకాయి పడ్డ డిఏ అరియర్స్, 12వ పిఆర్‌సి అమలు, సిపిఎస్ రద్దు, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజ్ తదితర సమస్యలు తక్షణమే పరిష్కరించాలని జిల్లా ఉద్యోగ ఉపాధ్యాయ పెన్సనర్స్ జేఏసి నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా ఉద్యోగ జేఏసి ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్‌లు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకు మునుపు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా ఉద్యోగ జేఏసి చైర్మన్ బి.చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో ఎపి ఎన్జీఓ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మాధవ, జేఏసి కన్వీనర్ డి.చంద్రమోహన్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, పెన్షనర్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు బి.పెద్దన్నగౌడ్, ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు, ఎపిటిఎఫ్ (1938) జిల్లా అధ్యక్షులు రవీంద్ర, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు రమణా రెడ్డి, జేఏసి నాయకులు జమీలా బేగం, ఫ్యాప్టో ఛైర్మన్ సిరాజుద్దీన్ తదితరులు హాజరై ప్రభుత్వ విధానాలను తీవ్రంగా వ్యతిరేకించారు. ఉద్యోగులకు 1వ తేది వేతనాలు అందే పరిస్థితి లేకుండా పోయిందని, పెన్షనర్‌లకు 15వ తేది కూడా పడటం లేదన్నారు. దాచుకున్న డబ్బులు ఇచ్చేందుకు కూడా ప్రభుత్వం మొండి వ్యవహరించడం దుర్మార్గంగా ఉందన్నారు. 12వ పిఆర్‌సి కమిషన్ నియామకానికే పరిమితం చేశారు తప్పా అమలుకు మీన మేషాలు ఎందుకు లెక్కిస్తున్నారో చెప్పాలన్నారు. ఆర్థిక బకాయిలు రూ.32 వేల కోట్లు తక్షణమే విడుదల చేయాలని కోరారు. లేని పక్ష్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి వై.వెంకటనారాయణ, వివిధ శాఖల ఉద్యోగ సంఘాల జేఏసి నాయకులు భవనారి వెంకటేష్ బాబు, ఫరూక్ అహ్మద్, నాగభూషణ్ రెడ్డి, సూరి బాబు, రవికుమార్, మనోహర్‌రెడ్డి, పి.శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ల సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-ఉరవకొండ

వాలంటీర్ వ్యవస్థతో సిఎం జగన్ ప్రజారంజక పాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం వజ్రకరూరు మండల కేంద్రంలోని మండల కార్యాలయ ప్రాంగణంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రభుత్వం చేపట్టిన ప్రతి పథకాన్ని ఇంటింటికీ అందజేస్తున్నారన్నారు. ఈ సేవల్లో వాలంటీర్ల పాత్ర మరువలేనిదన్నారు. ఈ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా ఆలోచిస్తున్నాయన్నారు. కాగా సిఎం జగన్ నాలుగున్నరేళ్లలో 99 శాతం హామీలను అమలు చేసి చూపించారన్నారు. డిబిటి నాన్ డిబిటి ద్వారా రూ.4.60 లక్షల కోట్లు నేరుగా ప్రజలకు అందించారన్నారు. ముఖ్యంగా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వంపై, జగన్‌పై ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా దుష్ప్రచారం ఎక్కువైందన్నారు. వారి ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.అనంతరం ప్రతిభ కనబరిచిన వాలంటీర్లకు సేవా పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరన్న, దేవీబాయి, మోనాలిసా,

బెళుగుప్పలో సేవా పథకాలు అందుకున్న వాలంటీర్లతో మాజీ ఎమ్మెల్యే విశ్వ

'వాలంటీర్లకు వందనం'లో నాయకులు

సుశీలారాణి, సుంకమ్మ, సుశీలమ్మ, సోమశేఖర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, వెంకటరెడ్డి, ఉస్మాన్, సుధీర్‌రెడ్డి, ప్యాపిలి భీమా, కిష్ట, సామానాయక్, ఎంపిడిఒ విజయలలిత, తహశీల్దార్ మహమ్మద్ రఫీక్, సిఐ ప్రవీణ్‌కుమార్, ఎంఎల్‌ఒ తేజేశ్వర్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి శ్రీధర్‌రావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: సిఎం జగన్ తీసుకొచ్చిన నవరత్నాల సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో వాలంటీర్ల పాత్ర కీలకమని నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని 1వ సచివాలయం వద్ద ఎంపిపి పెద్దన్న అధ్యక్షతన వాలంటీర్లకు వందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ఎంతో గొప్ప ఆలోచనలతో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వాలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి అందజేస్తున్నారన్నారు. ఈనేపథ్యంలో మరోసారి సిఎం జగన్‌ను ముఖ్యమంత్రి చేయడానికి వాలంటీర్లు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వాలంటీర్లకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు వీరన్న, వైసిపి మండల అధ్యక్షులు చిన్న మచ్చన్న, రాష్ట్ర వాల్మీకి డైరెక్టర్ బి.రామాంజనేయులు, సింగిల్‌విండో అధ్యక్షులు శివలింగప్ప, నాయకులు జి.శ్రీనివాసులు, పుష్పావతి, రామిరెడ్డి, రుద్రానంద, పురుషోత్తం, విజయభాస్కర్‌రెడ్డి, జె.రామేశ్వరరెడ్డి, కేశవరెడ్డి, వెంకటరెడ్డి, కరుణాకర్, నక్కలపల్లి భాస్కర్‌రెడ్డి, బాబురెడ్డి, టి.పాతన్న, ఎంఇఒ మల్లారెడ్డి, ఇఒఆర్‌డి మాధవరెడ్డి, సెక్రటరీలు వెంకటేశులు, ఉమా, శ్రీరాములు, జగదీష్, వాలంటర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని సెవెన్ హిల్స్ కళ్యాణ మండపంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ వాలంటీర్ సేవలను గుర్తించిన జగనన్న భవిష్యత్తులో వారికి మరింత మేలు చేకూర్చేందుకు సిద్ధంగా

ఉరవకొండలో వాలంటీర్లను సన్మానిస్తున్న నాయకులు

ఉన్నారనానరు. గత టిడిపి ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలని ఇబ్బందులకి గురి చేస్తే జగనన్న ప్రభుత్వంలో నేరుగా వాలంటీర్ వ్యవస్థతో ఇంటి దగ్గరికే సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు, రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్మన్ ప్రమీల, మండల కన్వీనర్ నిట్టూరు రఘునాథరెడ్డి, ఎంపిపి నాగేశ్వరరావు, సహకార పరపతి రంగం అధ్యక్షుడు లోకనాథ్‌రెడ్డి, వైస్ ఎంపిపి మల్లేశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

నార్పలలో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి


నియామకపత్రం అందజేస్తున్న కాలవ శ్రీనివాసులు

టిడిపి బిసి అధ్యక్షులుగా తిప్పేస్వామి

రాయదుర్గం : పట్టణ టిడిపి బిసి అధ్యక్షులుగా బూదురు తిప్పేస్వామిని నియమిస్తూ మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు ప్రకటనల విడుదల చేశారు. ఈయనతోపాటు పట్టణ బిసి సెల్ నూతన కమిటీని విడుదల చేశారు. ప్రధాన కార్యదర్శిగా ఏటూరి కుమార్, ఉపాధ్యక్షులుగా నాగరాజు, చన్నవీరా, తమ్మన్న, కార్యనిర్వాహక కార్యదర్శులుగా శ్రీరాములు, విజయకుమార్, గోవిందను నియమించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు పూజారి తిప్పయ్య, జిల్లా అధికార ప్రతినిధి పోరాళు పురుషోత్తం, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షులు కద్దిపుడీ మహబూబ్‌బాషా, జిల్లా బిసి సెల్ ధనార్జున, శంకర్, రాజశేఖర్, వేణు, యల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

రంగనాథస్వామి ఉత్సవ కమిటీ ఛైర్మన్‌గా పెద్దనారాయణ

గుత్తి : మండలంలోని తొండపాడు గ్రామంలో వెలిసిన బొలికొండ రంగనాథస్వామి ఉత్సవ కమిటీ ఛైర్మన్‌గా పెద్దనారాయణను నియమించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వి.దేవదాసు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26వ తేదీ వరకు జరిగే స్వామి బ్రహ్మోత్సవాలకు సందర్భంగా ఉత్సవ కమిటీ ఏర్పాటు చేస్తూ దేవాదాయ ధర్మాదాయ శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని తెలిపారు. ఛైర్మన్‌తోపాటు సభ్యులుగా ఎం.మద్దిలేటి, ఎం.వెంకటలక్ష్మి, ఎం.తిరుపాలు, ఎం.రంగప్ప, పి.నాగమణి, బి.వెంకటేష్, ఆర్.చిన్న రంగప్ప, డి.లింగమ్మను నియమించినట్లు తెలిపారు.

దేవమ్మమాతకు ప్రత్యేక పూజలు

బొమ్మనహాల్ : మండలంలోని కులగానహళ్లి గ్రామంలో వెలిసిన దేవమ్మ ఆలయంలో గ్రామస్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పసుపు, కుంకుమ, ఒడిబియ్యం కట్టి పట్టు వస్త్రాలతో అలంకరించారు. రాత్రంతా భజనలు, కోలాట, చెక్కభజనలు చేశారు. గ్రామ ప్రధాన ద్వారాలకు మామిడి ఆకుల తోరణాలతో అలంకరించి బుధవారం ఉదయం భక్తులకు ఉచిత ప్రసాదం ఏర్పాలు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-బెలుగుప్ప

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దుద్దేకుంట గ్రామంలో 'బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ, టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలలలో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అప్పుడు మీ సమస్యలన్నీ తీర్చేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమన్నారు. ఏ ఇంటికి వెళ్లినా తమకు ఇంటి పట్టాలు కావాలని, ఇంటి బిల్లులు పడలేదని ప్రజలు వాపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మహిళలతో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

ప్రజలకు కరువైన రక్షణ : జెసి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు రక్షణ కరువైందని మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జెసి ప్రభాకర్‌రెడ్డి చేపట్టిన యువ చైతన్య యాత్ర మంగళవారం ముగిసింది. మండలం పరిధిలోని చిన్నపప్పూరు నుంచి పెద్దపప్పూరు వరకూ రోడ్డు షో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ జెసి దివాకర్‌రెడ్డితోపాటు నియోజకవర్గ సమన్వయకర్త జెసి అస్మిత్‌రెడ్డి హాజరయ్యారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికా విలేకరులపైనే దాడులు చేస్తున్నారంటే ప్రభుత్వానికి సామాన్య ప్రజలు అంటే లెక్కే ఉండదన్నారు. కావున రానున్న ఎన్నికల్లో అభివృద్ధి చేసే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, యువ నాయకులు లోక్‌నాథ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శంకర్, తురకపల్లి సంజీవరెడ్డి, పసులూరు సర్పంచి శ్రీనివాస్‌నాయుడు, భాస్కర్‌రెడ్డి, కుమ్మెద హరినాథ్‌రెడ్డి, దేవుని ఉప్పలపాడు మాధవరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఉదయ్, గార్లదిన్నె నాగార్జునరెడ్డి, సింగనగుంటపల్లి నాగరాజు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

హారతి ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

ఓటు వినియోగంపై అవగాహన

మాట్లాడుతున్న తహశీల్దార్ చిట్టిబాబు

రాయదుర్గం : అంగవైకల్యం ఉన్నవారు, 80 ఏళ్ల పైబడిన వృద్ధులు ఇంటి వద్దనే ఓటు వేసే విషయమై మంగళవారం రాయదుర్గంలోని రెవెన్యూ సమావేశ మందిరంలో బిఎల్‌ఓలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాయదుర్గం తహశీల్దార్ చిట్టిబాబు మాట్లాడుతూ 80 ఏళ్ల పైబడిన వృద్ధులు, అంగవైకల్యంతో బాధపడువారు తమ ఇంటి వద్దనే ఓటుహక్కు వినియోగించే విషయమై తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ సుజాత, బీఎల్వోలు పాల్గొన్నారు.

ఫ్యాన్ స్పీడ్‌కు ప్రతిపక్షాలు మాయం

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో వైసిపి ఫ్యాన్ స్పీడ్‌కు ప్రతిపక్షాలు మాయమయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం అనంతపురంలోని 40వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైసీపీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైసిపి అధికారంలోకి వచ్చాక నాలుగున్నరేళ్లుగా అనంతపురం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ వైసిపి పార్లమెంట్ సమన్వయకర్త శంకరనారాయణతో కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫ్యాన్ స్పీడ్‌కు ప్రతిపక్షాలు తట్టుకోలేక పోతున్నాయన్నారు. ఈనేపథ్యంలో ఏమీ చేయలేక ఫ్యాన్ రెక్కలు విరుస్తామని అవాకులు, చవాకులు పేలుతున్నారన్నారు. స్పీడ్‌గా తిరుగుతున్న ఫ్యాన్‌కు ఎవరైనా చేయి అడ్డుపెడితే ఏమవుతుందో రాష్ట్రంలోని ప్రతిపక్షాలకు అదే పరిస్థితి ఎదురవుతుందన్నారు. గత ఎన్నికల్లో 151 సీట్లు గెలిచామని, ఈసారి 175 నియోజకవర్గాల్లో గెలిచి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు.

మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

'అభ్యసనా అభివృద్ధి' కార్యక్రమం

పామిడి : స్థానిక టి.సి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం అభ్యసనా అభివృద్ధి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రాష్ట్రస్థాయి పరిశీలన బృందం రాజేంద్రనాథరెడ్డి ఆధ్వర్యంలో అభ్యసనా అభివృద్ధి కార్యక్రమ నిర్వహణ, తరగతిలో బోధనా తీరును గమనించి తగిన సూచనలు ఇచ్చారు. అదేవిధంగా పాఠశాలలో నిర్వహిస్తున్న పాఠశాల సముదాయ సమావేశాలను కూడా సందర్శించి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాయచోటి డైట్ ప్రిన్సిపాల్ శివారెడ్డి, మాధవరెడ్డి, ప్రధానోపాధ్యాయులు రాంకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్రస్థాయి బృందం సభ్యులు

ఓబన్న జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

ప్రజాశక్తి-గుత్తి

స్వాతంత్ర్య సమరయోధులు, రేనాటి వీరుడు వడ్డే ఓబన్న జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని ఓసిసిఐ జాతీయ గౌరవ సలహాదారు గుంజి నరసింహారావు, ఏపీ వర్కింగ్ అధ్యక్షురాలు డి.లక్ష్మీదేవి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న వడ్డే ఓబన్న విగ్రహానికి ఓసిసిఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో వడ్డే ఓబన్న జయంతిని ప్రభుత్వమే నిర్వహిస్తోందన్నారు. ఏపీలో కూడా ప్రభుత్వమే జయంతిని నిర్వహించాలని కోరారు. వడ్డేర్లకు ప్రత్యేక కేటగిరీతో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఓసిసిఐ నాయకులు డి.వరదరాజులు, దస్తగిరి, ఎంగిలిబండ హరి, ఈరప్ప, వీరాంజనేయులు, శివ, తదితరులు పాల్గొన్నారు.

ఓబన్న జయంతి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఎపి రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులుగా పాటిల్ రామకృష్ణారెడ్డి

ఆత్మకూరు : ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులుగా పాటిల్ రామకృష్ణారెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్ష పదవికి ఎన్నిక చేసినందుకు రాష్ట్ర అధ్యక్షులు గంగలకుంట నరేష్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జిల్లావ్యాప్తంగా నియోజకవర్గాలు, మండలాల వ్యాప్తంగా కమిటీలు వేసి రెడ్డి సంఘం బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

నాణ్యతగా నాడు-నేడు పనులు

ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడు పనులను నాణ్యతతో చేపట్టాలని విడపనకల్ ఎంపిపి కరణం పుష్పావతి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని గడేకల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు కల్పిస్తున్న వసతులపై ఆరాతీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భోజనం రోజూ మెనూ ప్రకారం రుచితో అందిస్తున్నారని, ప్రాథమిక అవసరాలు తీర్చుకోవడానికి నీరు, మరుగుదొడ్ల సదుపాయాలు కల్పించారని, బైలింగ్వల్ పద్ధతిలో ఆంగ్ల మధ్యమం విద్యను అభ్యసిస్తున్నామని విద్యార్థులు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులు విద్యా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంపిపి పుష్పావతి

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ఉరవకొండ : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఎన్.రాఘవేంద్రప్ప హెచ్చరించారు. ఉరవకొండ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన రాఘవేంద్రప్ప ప్రజాశక్తితో మాట్లాడుతూ మండల ప్రజలతో స్నేహభావంతో మెలిగి సమస్యలు పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఉరవకొండపాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో రాజకీయ పార్టీ నాయకుల సమక్షంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా పదవ తరగతి మొదలుకుని ఉన్నత చదువులు చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో సమస్యలు ఎదురైనప్పుడు గొడవలకు దిగకుండా తమ దృష్టికి తీసుకొస్తే శాంతియుతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

అభివృద్ధికి నిదర్శనం చంద్రబాబు

మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్

ప్రజాశక్తి-పామిడి

అభివృద్ధికి నిదర్శనం టిడిపి అధినేత చంద్రబాబు అని మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్ అన్నారు. మంగళవారం పామిడి మండల కేంద్రం నుంచి మండల పరిధిలోని కట్టుకిందపల్లి గ్రామం, గుంతకల్లు నియోజకవర్గ పరిధి వరకూ టిడిపి హయాంలో వేసిన రోడ్డుపై సెల్ఫీ దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'చంద్రబాబు పేరు చెబితే గుర్తొచ్చేది ఏమైనా ఉందా.. అని అడిగావు కదా జగన్ రెడ్డి, బాబు చేసిన అభివృద్ధి నిదర్శనం ఈ డబుల్ రోడ్డు..' అని సెల్ఫీ వీడియోలో అన్నారు. టిడిపి హయాంలో చంద్రబాబు చొరవతో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రూ.26 కోట్లతో డబుల్ రోడ్డు వేశామన్నారు. ఇలాంటిది వైసిపి వచ్చిన తర్వాత ఒక్కటైనా నిర్మించారా.. అని నిలదీశారు. ప్రతి పల్లెలో చంద్రబాబు చేసిన అభివృద్ధి కళ్లకు కట్టినట్టు కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి హయాంలో వేసిన రోడ్డుపై సెల్ఫీ దిగుతున్న మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్

హుండీ ఆదాయం లెక్కింపు

పెద్దపప్పూరు : మండలం పరిధిలో వెలసిన అశ్వర్థ నారాయణస్వామి, భవానీ భీమలింగేశ్వర స్వామి హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. అశ్వర్థ నారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తులు భారీగా తరలిరావడంతో శాశ్వత హుండీల ద్వారా రూ.2,79,944, తాత్కాలికంగా హుండీల ద్వారా రూ.4,97,659 ఆదాయం వచ్చినట్లు ఇఒ సుబ్రమణ్యం, ఇన్స్‌పెక్టర్ లక్ష్మీనారాయణ, ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

24న రథోత్సవం

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని మల్లాపురం సమీపంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు అడియాన్ రామ్మూర్తిస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22న ధ్వజారోహణ, 23న స్వామివారి కల్యాణోత్సవం, 18వ మాలాదీక్షాధారణ, ఉచిత వివాహాలు, 24 న రథోత్సవం ఉంటుందన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

పార్టీలోకి చేరిన వారితో ప్రణయ్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీకి చెందిన 45 కుటుంబాలు వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి వై.ప్రణయ్‌రెడ్డి సమక్షంలో మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ప్రణయ్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా యువనేత మాట్లాడుతూ పార్టీలో చేరిన వారు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో వై.విశ్వేశ్వరరెడ్డి గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పామిడి సలీమ్, జెసిఎస్ పట్టణ కన్వీనర్ ఆసీఫ్, అమర్నాథ్, బేల్దారి శర్మస్, బేల్దారి అబ్దుల్, షేక్ తాజు, పాముల రంగప్ప, జోగి అంజి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనను మరోసారి గెలిపించుకుందాం

వైసిపి సమన్వయకర్త ఎం.వీరాంజనేయులు

ప్రజాశక్తి-శింగనమల

రాష్ట్రంలో కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమ పాలన అందిస్తున్న సిఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఎం.వీరాంజనేయులు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని ఆకులేడు, చిన్న జలాలపురం, నాగులగడ్డం, గురుగుంట్ల, లోలూరు, మదిరేపల్లి, గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి జగనన్న దీవెనలతో శింగనమల నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారని, మీ అందరి సహాయ సహకారాలతో పార్టీ బలోపేతానికి పని చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రజల సంక్షేమమే జగనన్న లక్ష్యమన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా సంక్షేమం, అభివృద్ధి పాలన జరుగుతోందన్నారు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాల ద్వారా ప్రతి సంక్షేమ పథకాన్ని ఇప్పటికే అందజేశారన్నారు. ఇలాంటి పరిపాలన మళ్లీ కొనసాగాలంటే రాబోయే ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైసిపి గెలిపించాలన్నారు. శింగనమల నియోజకవర్గంలో ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


గ్రామస్తులతో వైసిపి సమన్వయకర్త ఎం.వీరాంజనేయులు

టిడిపి మైనారిటీ విభాగం నూతన కార్యవర్గం ఏర్పాటు


టిడిపి మైనారిటీ కమిటీ జాబితా విడుదల చేస్తున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం : టిడిపి మైనారిటీ విభాగం నూతన కార్యవర్గాన్ని నియమిస్తూ మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు మంగళవారం ప్రకటనల విడుదల చేశారు. అధ్యక్షులుగా ఫకీర్ జావీద్, ఉపాధ్యక్షులుగా చౌదరి షఫీ, కే.అహమ్మద్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా మహల్దర్ నిసార్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా షేక్ ఇస్మాయిల్, పుంగనూరు ఇబ్రహీం, పకిర్ జక్రియను నియమించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షులు కడ్డీపుడి మహబూబ్ బాషా, జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షులు జమీల్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి ఇనాయాత్ బాషా, మరెంపల్లి ఉస్మాన్,ఘోర ఖలందర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటితో మసీదుల మరమ్మతులు

అనంతపురం కలెక్టరేట్ : ముస్లిం మైనార్టీల సంక్షేమంలో భాగంగా రూ.కోటి ఖర్చుతో మసీదుల మరమ్మత్తులు చేపట్టామని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి అన్నారు. మంగళవారం టిడిపి ఆధ్వర్యంలో 18వ డివిజన్ గుల్జార్ పేటలో ఇంటింటికీ టిడిపి ప్రచారం నిర్వహించారు. మైనారిటీల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపితోనే ముస్లిం మైనార్టీల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి జనసేన పార్టీల అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు డాక్టర్ రాజీవ్ రెడ్డి, సాలార్ బాషా, తలారి ఆదినారాయణ, దేవల్ల మురళి,, రమణ, జేయం బాషా, పరమేష్, నారాయణస్వామి యాదవ్, రాజారావు, సుధాకర్ యాదవ్, మారుతి కుమార్ గౌడ్, సైపుద్దీన్, స్వప్న, విజయశ్రీ రెడ్డి, సంఘ తేజస్విని, సరళ, జానకీ పాల్గొన్నారు

కూతురు కనిపించలేదని తండ్రి ఫిర్యాదు

పుట్లూరు : కూతురు కనిపించలేదని తండ్రి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... ఎస్.గూడూరు గ్రామానికి చెందిన శ్రీరంగా తన కూతురు కనిపించకుండా పోయినట్లు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.